# మణిద్వీపవర్ణన

మహాశక్తి మణిద్వీప నివాసిని ముల్లోకాలకు మూల ప్రకాశిని

మణిద్వీపములో మంత్రరూపిణి మన మనస్సులలో కొలువైయుంది||

సుగంధ పరిమళ పుష్పాలెన్నో వేలు అనంత సుందర సువర్ణపూలు

అచంచలంబగు మనోసుఖాలు మణి ద్వీపానికి మహానిధులు|| 2

లక్షల లక్షల లావణ్యాలు అక్షర లక్షల వాక్ సంపదలు

లక్షల లక్షల లక్ష్మీపతులు మణిద్వీపానికి మహానిధులు|| 3

పారిజాత వన సౌగంధాలు సురాధినాథుల సత్సంగాలు

గంధర్వాదుల గాన స్వరాలు మణిద్వీపానికి మహానిధులు

భువనేశ్వరీ సంకల్పమే జనియించే మణిద్వీపం

దేవదేవుల నివాసము అదియే కైవల్యం|| 4||

పద్మరాగములు సువర్ణమణులు పదిఆమడల పొడవున గలవు

మధుర మధురమగు చందన సుధలు మణిద్వీపానికి మహానిధులు|| 5

అరువది నాలుగు కళామతల్లులు వరాలనొసగే పదారుశక్తులు

పరివారముతో పంచబ్రహ్మలు మణిద్వీపానికి మహానిధులు|| 6

అష్టసిద్ధులు నవనవ నిధులు అష్టదిక్కుల దిక్పాలకులు

సృష్టికర్తలు సురలోకాలు మణిద్వీపానికి మహానిధులు|| 7

కోటి సూర్యుల ప్రచండకాంతులు కోటిచంద్రుల చల్లని వెలుగులు

కోటి తారకల వెలుగు జిలుగులు మణిద్వీపానికి మహానిధులు|| 8

కంచుగోడల ప్రాకారాలు రాగిగోడల చతురస్రాలు

ఏడామడల రత్నరాసులు మణి ద్వీపానికి మహానిధులు|| 9

పంచామృతమయ సరోవరాలు పంచలోహమయ ప్రాకారాలు

ప్రపంచమేలే ప్రజాధిపతులు మణి ద్వీపానికి మహానిధులు|| 10

ఇంద్రనీలమణి ఆభరణాలు వజ్రపు కోటలు వైఢూర్యాలు

పుష్యరాగమణి ప్రాకారాలు మణి ద్వీపానికి మహానిధులు|| 11

సప్తకోటి ఘన మంత్రవిద్యలు సర్వశుభప్రద ఇచ్ఛాశక్తులు

శ్రీగాయత్రీ జ్ఞానశక్తులు మణి ద్వీపానికి మహానిధులు|| 12

మిలమిలలాడే ముత్యపురాసులు తళతళలాడే చంద్రకాంతములు

విద్యుల్లతలు మరకతమణులు మణిద్వీపానికి మహానిధులు|| 13

కుబేర ఇంద్ర వరుణదేవులు శుభాలనొసగే అగ్నివాయువులు

భూమి గణపతి పరివారములు మణిద్వీపానికి మహానిధులు|| 14

భక్తి జ్ఞాన వైరాగ్యసిద్ధులు పంచభూతములు పంచశక్తులు

సప్తఋషులు నవగ్రహాలు మణిద్వీపానికి మహానిధులు|| 15

కస్తూరి మల్లిక కుందవనాలు సూర్యకాంతి శిలమహాగ్రహాలు

ఆరు ఋతువులు చతుర్వేదాలు మణిద్వీపానికి మహానిదులు|| 16

మంత్రిణి దండిని శక్తిసేనలు కాళికరాళి సేనాపతులు

ముప్పది రెండు మహాశక్తులు మణిద్వీపానికి మహానిధులు|| 17

సువర్ణరజిత సుందరగిరులు అనంతదేవీ పరిచారికలు

గోమేధికమణి నిర్మిత గుహలు మణిద్వీపానికి మహానిధులు|| 18



సప్తసముద్రము లనంత నిధులు యక్షకిన్నెర కింపురుషాదులు

నానాజగములు నదీనదములు మణిద్వీపానికి మహానిధులు|| 19

మానవ మాధవ దేవగణములు కామధేనువు కల్పతరువులు

సృష్టిస్థితిలయ కారణమూర్తులు మణిద్వీపానికి మహానిధులు|| 20

కోటి ప్రకృతుల సౌందర్యాలు సకలవేదములు ఉపనిషత్తులు

పదారు రేకుల పద్మశక్తులు మణిద్వీపానికి మహానిధులు|| 21

దివ్య ఫలములు దివ్యాస్త్రములు దివ్య పురుషులు ధీరమాతలు

దివ్య జగములు దివ్య శక్తులు మణిద్వీపానికి మహానిధులు|| 22

శ్రీ విఘ్నేశ్వర కుమారస్వాములు జ్ఞానముక్తి ఏకాంత భవనములు

మణి నిర్మితమగు మండపాలు మణిద్వీపానికి మహానిధులు|| 23

పంచభూతములు యాజమాన్యాలు ప్రవాళసాలం అనేకశక్తులు

సంతాన వృక్ష సముదాయాలు మణిద్వీపానికి మహానిధులు|| 24

చింతామణులు నవరత్నాలు నూరామడల వజ్రపురాసులు

వసంతవనములు గరుడపచ్చలు మణిద్వీపానికి మహానిధులు|| 25

ధుఃఖము తెలియని దేవీసేనలు నటనాట్యాలు సంగీతాలు

ధనకనకాలు పురుషార్ధాలు మణిద్వీపానికి మహానిధులు|| 26

పదునాలుగు లోకాలన్నిటిపైన సర్వలోకమను లోకము గలదు

సర్వలోకమే ఈ మణిద్వీపము సర్వేశ్వరికది శాశ్వతస్థానం || 27

చింతామణుల మందిరమందు పంచబ్రహ్మల మంచముపైన

మహాదేవుడు భువనేశ్వరితో నివసిస్తాడు మణిద్వీపములో|| 28

మణిగణ ఖచిత ఆభరణాలు చింతామణి పరమేశ్వరి దాల్చి

సౌందర్యానికి సౌందర్యముగా అగుపడుతుంది మణిద్వీపములో|| 29

పరదేవతను నిత్యము కొలిచి మనసర్పించి అర్చించినచో

అపారధనము సంపదలిచ్చి మణిద్వీపేశ్వరి దీవిస్తుంది||2|| 30

నూతన గృహములు కట్టినవారు మణిద్వీప వర్ణన తొమ్మిదిసార్లు

చదివిన చాలు అంతా శుభమే అష్టసంపదల తులతూగేరు||2|| 31

శివకవితేశ్వరి శ్రీ చక్రేశ్వరి మణిద్వీప వర్ణన చదివినచోట

తిష్ట వేసుకొని కూర్చొనునంటా కోటి శుభాలను సమకూర్చుకొనుటకై

భువనేశ్వరీ సంకల్పమే జనియించే మణిద్వీపం

దేవదేవుల నివాసము అదియే కైవల్యం|| 32||